క్లుప్తంగా

మురుగు తొలగించిన జీపీ సిబ్బంది



నాగసమందర్‌లో మురుగును శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: మురుగు...పరుగు అనే శీర్షికతో ఈ నెల 14న సాక్షిలో వచ్చిన వార్తకు గురువారం అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డుపై చేరిన మురుగు నీటిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపుల మట్టి తీసి కాల్వను శుభ్రంచేయడంతో మురుగంతా కాల్వనుంచి పారింది.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

మండల విద్యాధికారి గోపాల్



సమ్మర్ క్యాంపును పరిశీలిస్తున్న మండల విద్యాధికారి గోపాల్

పరిగి: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. గురువారం బసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ ప్రభుత్వ బడుల్లోనే ప్రారంభం అవుతాయన్నారు. సమ్మర్ క్యాంపులో కళలు, చిత్రలేఖనం , మట్టితో వివిధ ఆకృతులు, క్రీడలు తదితర విషయాలను విద్యార్థులు నేర్చుకోవచ్చన్నారు. సమ్మర్ క్యాంపులో నేర్చుకుంటున్న విద్యను విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా గుర్తించాలన్నారు. వేసవిలో సమ్మర్ క్యాంపునకు మంచి స్పందన వచ్చిందన్నారు. అది సంస్థ అందిస్తున్న బోధన విధానం వల్లె అని గుర్తుచేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

కనుల పండువగా వీరభద్రేశ్వర స్వామి జాతర



వీరభద్రేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో వీరభద్రేశ్వర స్వామి జాతర కనుల పండువగా కొనసాగుతున్నాయి. భక్తులు స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం వీరభద్రేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం చేపట్టారు. విజయ్‌కుమార్ దంపతులు, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. వీరారెడ్డిపల్లి, రాంపూర్, బెల్కటూర్‌తో పాటు తాండూరు పట్టణం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయం కిక్కిరిసిపోయింది.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనారోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులకు గురైన బాధితులకు ప్రయివేట్ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు జోగు వెంకటయ్య గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జంగయ్య, శ్రీను, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అమ్ముకునేదెలా?



ప్రధాన చౌరస్తాలో ధాన్యం బస్తాలతో ఆందోళన చేస్తున్న రైతులు

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

దోమ: ఆరుగాళం శ్రమించి సాగు చేసిన పంటలను విక్రయించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ఓ వైపు వర్ష భయం, మరో వైపు లారీల కొరత వేధింపులకు గురిచేస్తున్నాయి. చేతికొచ్చిన పంటను అమ్మి అప్పులు తీర్చుకుందామని కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అధికారుల అలసత్వం, నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఆయా కేంద్రాల వద్ద కర్షకులు నీరసించిపోతున్నారు. రేయింబవళ్లు కాపాల కాస్తూ దిగాలు చెందుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. మండల వ్యాప్తంగా అధికారులు 14 కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐదు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మూడు, ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు సెంటర్లను ఏర్పాటు చేయగా, వాటికి రెండు మిల్లులను మాత్రమే కేటాయించినట్లు తెలుస్తోంది. మోత్కూర్ సమీపంలోని మహాలక్ష్మి రైస్‌మిల్‌తో పాటు పరిగి పట్టణంలోని శ్రీ వెంకటసాయి రైస్‌మిల్లులో మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రధానచౌరస్తాలో ఆందోళన

మండల కేంద్రంలోని డీసీఎంఎస్ సెంటర్‌కు ధాన్యం బస్తాలను తీసుకువచ్చి ఎనిమిది రోజులు అవుతున్నా లారీలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. కురుస్తున్న వర్షాలకు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి ట్రాక్టర్ లోడ్‌లోని ధాన్యం బస్తాలను ప్రధానచౌరస్తాలో దించి ఆందోళన చేశారు. ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకొని అధికారులతో మాట్లాడి ధాన్యం తీసుకునేలా మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. మరో పక్క కొనుగోలు సెంటర్లలో గన్నీబ్యాగులు, టార్పలీన్లు అందుబాటులో లేవని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఏ ఒక్క అధికారి సెంటర్లను సందర్శించిన పాపాన పోలేదు.

సంచికి 42 కిలోలు

కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైస్ మిల్ యాజమాన్యంతో కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కొనుగోలు సెంటర్‌లో ఒక సంచికి 42 కిలోలు వేయింగ్ చేస్తూ రైస్ మిల్లులకు తరలిస్తున్నారని చెబుతున్నారు. వాస్తవానికి ఒక సంచికి 40.800 కిలో గ్రాములు వేయింగ్ చేయాలని అధికారులు చెబుతున్నారు.



వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం బస్తాలు

చర్యలు తీసుకుంటాం

రైతులు పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. క్షేత్ర స్థాయిలో పర్యటించి లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రతి కొనుగోలు సెంటర్‌కు లారీలను పంపిస్తాం. నిర్వాహకులు తాలు, తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళనకు గురి కావద్దు.

– ఆశీష్, సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

లారీల కొరత



కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఎనిమిది రోజులుగా ధాన్యాన్ని సెంటర్ వద్ద పెట్టి నిరీక్షిస్తున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే లారీల కొరత తీర్చాలి.

– బోయిని బోస్, రైతు, దోమ

తాలు, తరుగు పేరుతో దోపిడీ



పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే నిర్వాహకులు తాలు, తరుగు పేరుతో దోపిడీకి గురి చేస్తున్నారు. బస్తాకు 42 కిలోలు జోకుతున్నారు. 4 నుంచి 5 కిలోలు అదనంగా నింపుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

– కృష్ణయ్య, రైతు, దాదాపూర్

అధికారు నిర్లక్ష్యం



లారీలు రాక ఎనిమిది రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీసుకువచ్చిన ధాన్యం వర్షాలకు తడిసి మొలకెత్తాయి. సివిల్ సప్లై రవాణా టెండర్లలో అధికారులు నిబంధనలు పాటించలేదు. రాజకీయ ముసుగులో టెండర్లను అప్పగించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తీసుకువచ్చిన ధాన్యాన్ని సమయానుకూలంగా కొనుగోలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు.

– రాజిరెడ్డి, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు

రావులపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



వాహనాల తనిఖీ చేస్తున్న ఏఈఓ ఐసాక్ హెరాల్డ్

కొడంగల్ రూరల్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతం రావులపల్లి గ్రామ శివారు సమీపంలోని చెక్‌పోస్టు దగ్గర వ్యవసాయాధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక నుంచి కొడంగల్ ప్రాంతానికి వడ్లు విక్రయించేందుకు తీసుకొస్తున్న క్రమంలో దాదాపు 500 బస్తాలను పట్టుకొని తిరిగి కర్ణాటక రాష్ట్రానికి పంపించేశారు. అక్కడ తక్కువ ధర కారణంగా ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో అధికారులు కర్ణాటక రైతులకు అవగాహన కల్పించి ఎక్కడి ధాన్యం అక్కడే అమ్ముకోవాలని వివరించారు. మళ్లీ ఇక్కడికి అక్రమంగా తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఐసాక్ హెరాల్డ్, ఏఎస్ఐ ఎల్లప్ప, కానిస్టేబుల్ శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలి

మండల వ్యవసాయాధికారి తులసి



రైతువేదికలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తులసి

కొడంగల్ రూరల్: రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి తులసి సూచించారు. గురువారం మండల పరిధిలోని పర్సాపూర్, రుద్రారం రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులు చేపడుతున్న నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించి అవగాహన కల్పించారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా సంబంధిత వివరాలను వ్యవసాయాధికారులకు అందజేయాలని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కార్డుకు లింక్ ఉన్న మొబైల్ నంబర్‌ను చెప్పాలన్నారు. సంబంధిత వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించిన అనంతరం 11అంకెల విశిష్ట సంఖ్య కోసం నమోదు చేయబడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా ఉండేందుకు విశిష్ట సంఖ్య కీలకం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీపతిరెడ్డి, రాజు రాథోడ్, అశ్విని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వరిధాన్యం ప్రైవేట్‌కే విక్రయం

- భరోసా కల్పించని ప్రభుత్వం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



విక్రయానికి వరిధాన్యం

తాండూరు రూరల్: ఆఖరి గింజ వరకు వరిధాన్యం కొనుగోళ్లు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమవుతుందని, రైతులకు భరోసా కల్పించలేకపోతుందని చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేట్‌కే మొగ్గు చూపుతున్నామని తెలిపారు. వీరారెడ్డిపల్లి, రాంపూర్ గ్రామాల్లో సాగు చేసిన వరిధాన్యాన్ని విక్రయించేందుకు నానా అవస్థలు పడుతున్నామన్నారు. వీరారెడ్డిపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. తాండూరు పట్టణంలోని డీసీఎంఎస్ కేంద్రంలో విక్రయించాలని ఆయా గ్రామాల కర్షకులకు అధికారులు సూచించారు. దీంతో వీరారెడ్డిపల్లి నుంచి తాండూరు పట్టణానికి 10 కిలో మీటర్ల దూరం ఉంటుందని, రవాణా ఖర్చులు పెరుగుతాయని చెబుతున్నారు. వరిధాన్యం తెచ్చిన తర్వాత డీసీఎంఎస్ కేంద్రం వద్ద ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందనే భయంతో ప్రయివేట్‌కే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నామని అన్నదాతలు వివరిస్తున్నారు.

తెలంగాణ ఆడబిడ్డలతో కాళ్లు కడిగించడం సరికాదు

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కావ్యకృష్ణగౌడ్

చేవెళ్ల: వీరవనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు అవమానం జరిగిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్యకృష్ణగౌడ్ అన్నారు. చేవెళ్లలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచ అందాల పోటీలకు వచ్చిన యువతుల కాళ్లను మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించటం సరైందికాదన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ అభిమానాన్ని అందాల పోటీలకు వచ్చిన వారి పాదాల దగ్గర పెట్టేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విదేశీ అందగత్తెలకు కాలు కడిగి రుమాలతో తుడిపించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ చర్య మహిళలకే కాదు తెలంగాణ సమాజానికి అవమానకరమన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం పాల్పడటం దుర్మార్గమైనదన్నారు. దీనిపై ప్రభుత్వం ముఖ్యమంత్రి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ వనితల సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏఈఓ సందీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై రైతులతో చర్చిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థ తాండూరు శాస్త్రవేత్తలు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. ఉదయం 8.30 గంటలనుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

మర్పల్లి: కల్‌ఖోడ గ్రామానికి చెందిన సుంకి మాణయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తన ఇంట్లో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగ్రిగ శ్రీకాంత్ రెడ్డి మాణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల కోసం ఆయన పంపిన రూ.5వేలు మాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం తదితరులు మృతుని ఇంటికి వెళ్లి అందజేశారు.

నేడు చేవెళ్లలో రక్తదాన శిబిరం

చేవెళ్ల: ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదినం సందర్భంగా చేవెళ్లలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ గొనే ప్రతాప్‌రెడ్డి, పామెన మాజీ సర్పంచ్ దవాల్గారి గోపాల్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో గురువారం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

చేవెళ్ల: పిడుగుపడి ఓ రైతు రెండు ఎద్దులు మృతి చెందటంతో బాధిత కుటుంబానికి నాయకులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని పామెన గ్రామంలో బుధవారం రాత్రి పిడుగు పడి రెండు ఎద్దులు మృతి చెందిన బాధిత రైతు సదానందంకు మండలంలోని పలువురు నాయకులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన సమాచారానికి మండల నాయకులు, ప్రజలు స్పందించారు. రైతుకు నేరుగా కొందరు ఆన్‌లైన్ ద్వారా, మరికొందరు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి అందించిన రూ.5వేల నగదును మాజీ సర్పంచ్ దవాల్గారి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్



ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న మధుకర్

మర్పల్లి: ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పబ్బే మధుకర్ పేర్కొన్నారు. గురువారం వీర్లపల్లి గ్రామంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం, గ్రామ దేవతల జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.51వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను పార్టీలకతీతంగా కలిసిమెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మధుకర్‌ను సర్పంచ్ సుధాకర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మర్పల్లి మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బిల్‌కల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం బాధాకరం

కుల్కచర్ల: మిస్ యూనివర్స్ పోటీల్లో భాగంగా విదేశి యువతుల కాళ్లు కడిగించే చర్యలు తెలంగాణ మహిళలను కించపరచడమేనని పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మిస్ యూనివర్స్ పోటీల్లో భాగంగా ఒక కార్యక్రమంలో విదేశి యువతుల కాళ్లను కడిగించడం బాధాకరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, నిర్వాహకులు తెలంగాణ మహిళా సమాజానికి క్షమాపణలు చెప్పాలని, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న నారాయణ

కొడంగల్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఆపరేషన్ మిర్సి ఇండియా ఫౌండేషన్(ఓఎంఐఎఫ్) కోఆర్డినేటర్ కె నారాయణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని, భారం అనుకోవద్దని బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయొద్దని, ఆడ పిల్లలు చదువుకుంటే కుటుంబం బలపడుతుందన్నారు. బాల్య వివాహాలను నిషేధించాలని, మూఢ నమ్మకాలను విశ్వసించొద్దని, జోగిని వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్స్ హన్మంతు, యాదయ్య, సంస్థ కో ఆర్డినేటర్లు, హెల్త్ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

పాత్రికేయుల ఉన్నతికి సంక్షేమ పథకాలు

- టీయూడబ్ల్యూజే, ఐజేయూ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి
- మండల ప్రెస్‌క్లబ్ కమిటీ ఏకగ్రీవం



సభ్యత్వ నమోదులో కుల్కచర్ల విలేకరులు

కుల్కచర్ల: ప్రభుత్వాలు పాత్రికేయుల ఉన్నతికి ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు అమలుచేయాల్సిన అవసరం ఉందని పరిగి నియోజకవర్గ టీయూడబ్ల్యూజే, ఐజేయూ అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే పాత్రికేయుల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీయూడబ్ల్యూజే, ఐజేయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా పాండు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కోశాధికారిగా గణేష్, కార్యదర్శిగా అరవింద్, సహాయ కార్యదర్శిగా నర్సింలును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాఘవేందర్ రెడ్డి, రాజేష్, విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, రాఘవేంద్ర చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు!



ప్రమాదకరంగా కొత్తపల్లి మలుపు

కనిపించని హెచ్చరిక బోర్డులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిగుండా ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌కు వెళ్లే ఈ రోడ్డు మార్గం రెండు చోట్ల మలుపులు తిరిగి ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ దారిగుండా ప్రయాణం చేయాలంటే ఒక చోట పూర్తిగా యూ ఆకారంలో ఉండగా, మరో చోట చెరువు దగ్గర మూల మలుపు వంపు తిరిగి ప్రమాదకరంగా కనిపిస్తుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించ ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరం నుంచి హరన్ మోగిస్తే కాని వాహనాలు వస్తున్నాయనే సంకేతం తెలుస్తుంది. లేదంటే అంతే సంగతులు ప్రమాదాలకు గురికాక తప్పదు. ఒక్కోసారి ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. చెరువు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంచెలు, పొదలు ఒత్తుకొని ఉండడంతో ద్విచక్ర వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. మలుపులు ఇంత ప్రమాదకరంగా తయారైనప్పటికీ సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయించడం లేదు. ఈ విషయంలో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.